క్లుప్తంగా

జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక

గార్ల: సీఎం కప్ క్రీడల్లో గార్ల నిర్మలా హైస్కూల్‌కు చెందిన 10మంది విద్యార్థులు మండల స్థాయిలో అత్యంత ప్రతిభ కనబర్చి, జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సిస్టర్ జీన్సీ, వైస్ ప్రిన్సిపాల్ జర్లన్, కరస్పాండెంట్ మెర్సీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఖోఖో పోటీలకు..

కేసముద్రం: సీఎం కప్ జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు కేసముద్రంవిలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ తెలిపారు. విద్యార్థులు అనిరుధ్, భరత్, నగేష్, ప్రణయ్, హర్షిత్ ఎంపికయ్యారు. శుక్రవారం ఉపాధ్యాయ బృందం అభినందించారు.

క్రిస్మస్ వేడుకలు



మహబూబాబాద్ అర్బన్: ఐక్య క్రిస్మస్ సెలబ్రేషన్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సంఘం వ్యవస్థాపకుడు బిషప్ ఇశ్రాయేలు అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని గిరిప్రసాద్ కాలనీలో హెచ్ఎఫ్ఎం చర్చిలో శుక్రవారం సెమి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రెవరండ్ ఫాదర్ డి.డేవిడ్ దామోదర్ హాజరై కేక్ కట్ చేశాడు.

గణిత పోటీలకు ఎంపిక

మహబూబాబాద్ రూరల్: హైదరాబాదులో జరగనున్న రాష్ట్రస్థాయి గణిత పోటీలకు మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వెంపటి విగ్నేష్ ఎంపికయ్యాడని హెచ్ఎం ఎస్.రమేశ్‌బాబు శుక్రవారం తెలిపారు. విద్యార్థి విగ్నేష్, గైడ్ టీచర్ సతీష్ కుమార్, గణిత ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, కాసం శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, ఉప్పలయ్య, సోహెన్, తిరుపతి, శోభారాణి, సోమేశ్వర్, ఝాన్సీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్స్ విడుదల చేయాలి

నెల్లికుదురు/నెహ్రూసెంటర్: భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన పెండింగ్ క్లెయిమ్స్‌ను వెంటనే విడుదల చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా జిల్లా కార్యదర్శి మంద శంకర్ అన్నారు. జిల్లా లేబర్ కార్యాలయంలో జిల్లా అధికారి నారాయణస్వామికి శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జానీ, కొమ్ము యాకయ్య, మహమూద్, ముల్కలపల్లి సురేష్, కేదాసు రమేశ్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

మహబూబాబాద్ అర్బన్: నవతెలంగాణ విద్యార్థి సంఘం 12 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని యశోద గార్డెన్‌లో ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు ఎన్టీవీఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్ననాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమలో ప్రొఫెసర్లు తిరుపతి, విజయ్ కుమార్, రమేశ్, సుందర్ నాయక్, రవీందర్ నాయక్, ధరంసోత్ వీరేశ్, తదితరులు పాల్గొన్నారు.

హార్వెస్టర్ బోల్తా

బయ్యారం: ప్రమాదవశాత్తు వరికోత యంత్రం బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలోని ఇర్సులాపురంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్‌కు చెందిన టైర్ల మిషన్‌ను వరి కోసేందుకు ఇటీవల ఇర్సులాపురానికి తీసుకొచ్చారు. ఈక్రమంలో వరికోత కోసేందుకు మిషన్‌ను తీసుకెళ్తున్న సమయంలో అదుపుతప్పి మిషన్ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ మధుకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్

గార్ల: హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన సౌత్ నేషనల్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్‌లో గార్లకు చెందిన మహ్మద్‌పాషా 105కేజీల విభాగంలో అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించాడు.

డ్రమ్ సీడర్‌తో వరిసాగు..

తగ్గుతున్న పెట్టుబడి ఖర్చులు
- నాట్లు అవసరం లేదు
- దమ్ములో నేరుగా విత్తనం

పెద్దవంగర: వ్యవసాయంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు నూతన పద్ధతులు అవలంబిస్తున్నారు. వరిసాగులో కూలీలు, పెట్టుబడులు తగ్గించి అధిక దిగుబడులు సాధించేందుకు డ్రమ్ సీడర్‌తో వరిసాగు పద్ధతిని అనుసరించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. దీంతో డ్రమ్ సీడర్ వరిసాగుపై రైతుల దృష్టి సారిస్తున్నారు. ఈ రబీలో రైతులు వరిసాగులో ఈ విధానం వైపు మొగ్గు చూపుతున్నారు. పెట్టుబడులు తగ్గడమే కాకుండా కాలం ఆదా అవుతోంది. డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు విత్తేటప్పుడు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

మండలంలో సుమారు ఈయాసంగిలో 13,023 ఎకరాల్లో వరిసాగు కానున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. డ్రమ్‌సీడర్‌తో ప్రస్తుతం



కిష్టుతండాలో డ్రమ్‌సీడర్‌తో వరిసాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

యాసంగిలో 30శాతం వరిసాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

డ్రమ్ సీడర్‌తో లాభాలు..

డ్రమ్ సీడర్ పరికరం ఉపయోగిస్తే కూలీల ఖర్చు తగ్గంతోపాటు విత్తనాల ఖర్చు ఆదా అవుతోంది. విత్తనాలను నేలపై సమాన రీతిలో చల్లుతోంది. నాలుగు వరుసల డ్రమ్ సీడర్, ఎనిమిది వరుసల డ్రమ్ సీడర్లు ఉన్నాయి. గింజలను నారుగా పోసేమందు 12గంటల పాటు నానా బెట్టుకోవాలి. రోజుకు 4ఎకరాల భూమిలో విత్తనాలను నారుగా చల్లుకోవచ్చు. డ్రమ్‌సీడర్ వరిసాగు విధానంలో ఎకరానికి 15నుంచి 20కిలోల విత్తనం ఆదా అవుతోంది. పంట సైతం 7నుంచి 10 రోజుల ముందుగానే కోతకు వస్తోంది. సాగు ఖర్చులు ఎకరాకు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు తగ్గుతోంది.

పలు జాగ్రత్తలు పాటించాలి



ప్రతికూల వాతావరణ పరిస్థితులో పంటకాలం కోల్పోకుండా నీరు అందుబాటులో ఉన్నప్పుడే వరి సాగు చేసుకోవాలి. విత్తనాలు వేసే క్రమంలో హ్యాండిల్ పట్టుకొని పొలంలో తిరగాలి. చక్రాలు తిరగడం వల్ల విత్తనాలు సమానంగా పడతాయి. ఈ విధానంతో కూలీల కొరతను అధిగమించొచ్చు.

– స్వామి నాయక్, మండల వ్యవసాయ అధికారి

హాస్టల్ వార్డెన్‌పై చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఎస్సీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్‌పై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని హస్తినాపురం కాలనీలోని ఎస్సీ హాస్టల్ ఎదుట శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నిరసన తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించాల్సి ఉండగా పచ్చడితో భోజనం పెట్టడంపై తీవ్రంగా మండిపడ్డారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి వార్డెన్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, వినోద్, యాకన్న, నరేష్, బాలు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు

అనాథ బాలికలకు ఆర్థికసాయం



పండ్లు అందజేస్తున్న పోలీసులు

కురవి: మండలంలోని బలపాల గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారి అమ్మమ్మ వద్ద ఉంటున్న చిన్నారులకు కురవి పోలీసులు అండగా నిలిచారు. శుక్రవారం బాలికలకు రూ.20వేల ఆర్థికసాయం అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. కురవి ఎస్సై గంద్రాతి సతీష్ రూ.10వేలు, స్టేషన్‌లోని సిబ్బంది అందరు కలసి రూ.10వేలు సేకరించి సుమలత, నాగమణి పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎస్సై సతీష్, ఏఎస్సైలు సదయ్య, వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య, కానిస్టేబుళ్లు భద్రు, రమేశ్, కాశీరాం, యాకేష్, శ్రావణి బాలికలకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు, పండ్లు అందజేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి సతీష్‌రెడ్డి

మహబూబాబాద్: ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరవధిక దీక్ష చేపట్టారు. కాగా శుక్రవారం దీక్షను పీఆర్టీయూ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశాడు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో ఖాదర్, ప్రభాకర్, బాసింగ్, తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్: దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

మరిపెడ రూరల్: రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్, రెగ్యులరైజ్, ఉద్యోగ భద్రత, కేర్ టేకర్ల నియామకం తదితర న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు లింగా నాయక్, ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వెదజల్లే పద్ధతితో పెట్టుబడి ఆదా

గార్ల: వరిపంటలో వెదజల్లే పద్ధతి పాటించడం ద్వారా ఎకరాకు రూ.10వేల నుంచి రూ.12వేల వరకు రైతుకు పెట్టుబడి మిగులుతుందని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు. శుక్రవారం మండలంలోని సేరిపురం గ్రామంలో వెదజల్లే పద్ధతి ద్వారా వరిపంట సాగు చేసిన రైతుపొలంలో ఆయన క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు అవగాహన కల్పించారు.

కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

డోర్నకల్: కేజీబీవీ, యూఆర్ఎస్, ఎమ్మార్సీలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వివేక్ కోరారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో జరిగిన యూటీఎఫ్ సమావేశంలో వివేక్ మాట్లాడుతూ.. మినిమం టైమ్ స్కేల్, రెగ్యులరైజ్, ఉద్యోగుల భద్రత తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్, నాయకులు నిజాంమియా, రామకృష్ణ, అమీన్, సాహెబ్‌అలీ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే

కేసముద్రం: అర్హులైన పేదలందరికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కల్వల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ మధుసూదన్, ఎంపీడీఓ క్రాంతి, ఎంఈఓ యాదగిరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డుల్లో ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన సర్వే శుక్రవారం ప్రారంభమైంది. సర్వే కోసం కేటాయించిన వార్డు అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు.

దంతాలపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దారు కాటం చంద్ర జగదీశ్వర్ అన్నారు. మండలంలోని తూర్పుతండా, రామవరం, కుమ్మరికుంట్ల, రేపోని, బీరిశెట్టిగూడెం గ్రామాలలో ప్రారంభమైన సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ నిజాముద్దీన్, పాల్గొన్నారు.



కేసముద్రం: కల్వల గ్రామంలో సర్వే ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డి

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీ



మాట్లాడుతున్న రాజేందర్

నెహ్రూసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల్లో అధిక ఫీజులు, బిల్లుల దోపిడీని అరికట్టాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మోకాళ్ల రమేశ్, ఎలకంటి రాజేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించి అక్రమంగా నడిపిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్య తీసుకోవాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగుల నుంచి ఇష్టానుసారంగా టెస్టులు, స్కానింగ్‌ల పేరా విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ ఆస్పత్రులపై ప్రభుత్వం దృష్టి సారించి సామాన్య ప్రజలకు మేలు చేయాలన్నారు. ఈ సమావేశంలో తుడుం వీరభద్రం, నోముల భానుచందర్, భట్టు చైతన్య, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

నెల్లికుదురు: వర్షాలకు తెగిపోయిన ఎస్సారెస్పీ కాల్వకు పడిన గండికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గుణగంటి రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం ఇనుగుర్తి మండలంలోని మీఠ్యాతండా శివారు మర్రికుంట తండా పరిధిలో తెగిపోయిన కాల్వను పరిశీలించారు.

విద్యుత్ సమస్యలపై స్పందించాలి

దంతాలపల్లి: విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సత్వరమే స్పందించి వారి సమస్యలు తీర్చేందుకు కృషి చేయాలని వినియోగదారుల సీజీఆర్ఎఫ్ వరంగల్ చైర్మన్ వేణుగోపాలచారి అన్నారు. మండలకేంద్రంలోని సబ్ స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో శుక్రవారం ఆయ మాట్లాడారు. విద్యుత్ పనులు సకాలంలో చేయకుండా సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ మెంబర్ రమేశ్, ఫైనాన్స్ మెంబర్ చరణ్‌దాస్, ఇండిపెండెంట్ రామారావు, ఎస్సీ నరేష్, డీఈ మధుసూదన్, ఏడీ చలపతిరావు, అసిస్టెంట్ ఏఈ ప్రవీణ్, అసిస్టెంట్ ఇంజనీర్ తరుణ్ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న వేణుగోపాలచారి

సంక్షిప్త సమాచారం

ఉపాధ్యాయుల నిరసన

నర్సింహులపేట: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఎదుట ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు: మండల కేంద్రంతో పాటు తీగలవేణి విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో నేడు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ ప్రణీత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గ్యారంటీలను అమలు చేయాలి

కేసముద్రం: ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు



గార్ల: యువతిపై అదృశ్యం కేసు నమోదైన సంఘటన శుక్రవారం ముల్కనూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై జీనత్‌కుమార్ కథనం ప్రకారం.. గార్ల మండలం ముల్కనూరు గ్రామానికి చెందిన బొల్లెం ఉష ఈనెల 11న ఇంట్లో వేరే గదిలో నిద్రిస్తోంది. తెల్లవారుజామున తల్లి చూడగా ఉష కనిపించలేదు. దీంతో తల్లి లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మానుకోటలో వ్యక్తి..



మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని వెంకటేశ్వర బజారులో నివాసం ఉండే అరటిపండ్ల వ్యాపారి దాసరి పాపయ్య అదృశ్యమైన ఘటనలో అతడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం రాత్రి తెలిపారు. పాపయ్య నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి కుటుంబ సభ్యులకు ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడని, ఆయన ఆచూకీ కోసం విచారించగా ఎలాంటి సమాచారం రాకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం

మహబూబాబాద్ రూరల్: గీతా జయంతి సందర్భంగా తిరుపతి దేవస్థానముల వారి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీమద్భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు రామిరెడ్డి కృష్ణమూర్తి, యిమ్మడి రవికుమార్, ఉమాదేవి, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ సందర్శన

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ముడుపుగల్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వర స్వామి వారి దేవాలయాన్ని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు శుక్రవారం సందర్శించారు. ఆలయ నిర్మాణ పనుల పురోగతిపై ఆలయ నిర్మాణకర్త యాస వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్సీ రవీందర్‌రావు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెంకన్న గౌడ్, బయ్య లింగయ్య పాల్గొన్నారు.

కుష్టును నిర్మూలించాలి

పెద్దవంగర: కుష్టు వ్యాధిని నిర్మూలించడం అందరి బాధ్యత అని డిప్యూటీ పారా మెడికల్ అధికారి వనాకర్ రెడ్డి పేర్కొన్నారు. లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని వడ్డెకొత్తపల్లిలో జరుగుతున్న ఇంటింటి సర్వేను డాక్టర్ మానసతో కలసి పరిశీలించారు.

బ్యాగుల అందజేత

కురవి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలికలకు హైదరాబాద్‌కు చెందిన వీరభద్రస్వామి సేవాసమితి సభ్యుడు, ఆలయ ధర్మకర్త కాసుల మల్లికార్జున్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన పది మంది బాలికలకు బ్యాగులు, బాటిల్స్‌ను శుక్రవారం అందజేశారు.

బేడీలతో తీసుకెళ్లడం దుర్మార్గం

నెహ్రూసెంటర్: లగచర్ల ఘటనలో రిమాండ్ రైతులకు బేడీలు వేసి వైద్యానికి తీసుకెళ్లడం దుర్మార్గపు చర్య అని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల భిక్షపతి, ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య శుక్రవారం అన్నారు.

పిల్లలకు టీకాలు వేయించాలి

గూడూరు: పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ టీకాలు వేయించాలని చైల్డ్ హెల్త్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని తీగలవేణి పీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు.

హామీలను నెరవేర్చాలి

మహబూబాబాద్: ఉపాధ్యాయుల హామీలను వెంటనే అమలు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ డిమాండ్ చేశాడు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు.

గొలుసు కాంటాల సీజ్

కొత్తగూడ: మండలంలోని గాంధీనగర్ సమీపంలో ప్రైవేటు వ్యాపారి గొలుసు కాంటాతో రైతుల ధాన్యం కొనుగోలు చేస్తుండగా తహసీల్దార్ రమాదేవి శుక్రవారం సీజ్ చేశారు.

వసతులు కల్పించాలి

డోర్నకల్: స్థానిక పశువైద్యశాలలో వసతులు కల్పించాలని పశువైద్యాధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావు కోరారు. పశువైద్యశాలలో వసతులు కల్పించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

వసతిగృహం సందర్శన

దంతాలపల్లి: వసతిగృహాల్లో విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దముప్పారం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆయన సందర్శించారు.

జయప్రదం చేయాలి

పెద్దవంగర: ఈనెల 17న హైదరాబాద్ చేపట్టే మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నవంగర గ్రామంలో జీపీ కార్మికులతో సమావేశం నిర్వహించారు.

17న ధర్మాగ్రహ దీక్ష

కేసముద్రం: హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో ఈనెల 17న టీపీయూఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్మాగ్రహ దీక్ష వాల్‌పోస్టర్లను శుక్రవారం మండలంలోని కల్వల జెడ్పీ హైస్కూల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు రాగి సోమనర్సయ్య పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష చూపొద్దు

దంతాలపల్లి: ఆడపిల్లను ఎదగనిద్దాం, చదవనిద్దాం అని హెచ్ఎం కొమ్మావరపు కృష్ణయ్య అన్నారు. మండలంలోని దాట్ల పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం మహబూబాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డీహెచ్ఈ డబ్ల్యూడీ మహేశ్వరి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు సహపంక్తి భోజనాలు

దంతాలపల్లి: మండల కేంద్రంలో గల గిరిజన ఆశ్రమ పాఠశాల, మహాత్మజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలతోపాటు మండలంలోని పెద్దముప్పారం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో నేడు సహపంక్తి భోజనాలు ఉంటాయని శుక్రవారం ప్రభుత్వ అధికారులు తెలిపారు.

ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు శుక్రవారం వీరభద్రస్వామి ఆలయం మండపంలో ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ ధర్మాదాయ శాఖ మహబూబాబాద్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత 14మంది కొర్ను రవీందర్‌రెడ్డి, బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, కుదురుపాక ఉప్పలయ్య, బందెల సంజీవరెడ్డి, డొంగలి జనార్దన్‌రెడ్డి, ధరావత్ రజిత, గడీల భిక్షపతి, ప్రొద్దుటూరి సత్యనారాయణ, భూక్య శక్రు, గుగులోత్ సోమ్లా, వెంపటి శ్రీను, కాసుల మల్లికార్జున్, రెడ్యాల శ్రీనివాస్‌లతో ధర్మకర్తలుగా ప్రమాణస్వీకారం చేయించారు. ధర్మకర్తలందరు కలసి చైర్మన్‌గా కొర్ను రవీందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యనారాయణ, మానుకోట మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, బండి వెంకటరెడ్డి, బాదావత్ రాము నాయక్, నూకల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

దొంగతనం కేసులో ఇద్దరికి శిక్ష, జరిమానా

దంతాలపల్లి: దొంగతనం కేసులో ఇద్దరికి జైలు శిక్షతో పాటు జరిమానా పడినట్లు ఎస్సై పిల్లల రాజు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని రాంనగర్ కాలనీకి చెందిన నెల్లల అనిల్‌కుమార్, మంగలివాడకు చెందిన బీమిలి రాజ్‌కుమార్ గతేడాది మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన మారగాని కృష్ణమూర్తి ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారన్నారు. ఈక్రమంలో పోలీసులు నేరస్తులను గుర్తించి అరెస్టు చేశారు. కేసు వాదోపవాదనల అనంతరం నేరం రుజువుకావడంతో తొర్రూరు జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సరిత వారికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.500చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో నిందితులకు శిక్షపడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేవతిదేవి, కోర్టు కానిస్టేబుల్ రాజారామ్‌ను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

ఉరివేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని గుండ్లకుంట కాలనీలో నివాసం ఉండే జక్కోజు ధనమ్మ (70) భర్త కొన్నేళ్ల క్రితం మృతిచెందగా కుమారులు, కుమార్తెలు లేకపోవటంతో ఒంటరిగా ఉంటుంది. కొంతకాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మనస్తాపానికిగురై శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి చెల్లెలు సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన జిల్లా కేంద్రం శివారులోని ఈదులపూసపల్లి రోడ్డులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండల కేంద్రం నుంచి ఓ ఆటో ఆరుగురు ప్రయాణికులతో జిల్లా కేంద్రానికి వస్తుంది. ఆటో జిల్లా కేంద్రం శివారులోని ఈదులపూసపల్లి రోడ్డు మీదుగా వస్తుండగా అక్కడి టింబర్ డిపో సమీపంలో నుంచి ఒక్కసారిగా గేదెలు రోడ్డు దాటుతున్నాయి. వెంటనే ఆటో డ్రైవర్ నాగ తన వాహనాన్ని రోడ్డు పక్కన నిలుపుతుండగా ఓ గేదె పరుగెత్తుకుంటూ వచ్చి ఆటోకు గట్టిగా తగలడంతో పక్కకు పడిపోయింది. ఈప్రమాదంలో డ్రైవరు పక్కనే కూర్చున్న కేసముద్రంకు చెందిన దర్శనం సాయిలు, మరో ఇద్దరు ప్రయాణికులు కిందపడిపోయారు. సాయిలుకు తీవ్రగాయాలుకాగా ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం అదే ఆటోలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

సైబర్ క్రైం కేసు నమోదు

నర్సింహులపేట: మండలంలోని కొమ్ములవంచ గ్రామానికి చెందిన చీకటి రమేశ్ ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. ఎస్సై తెలిపిని వివరాల ప్రకారం.. కొమ్ములవంచకు చెందిన చీకటి రమేశ్‌కు ఈనెల 3వ తేదీన క్రెడిట్ కార్డుకు కేవైసీ చేసుకోవాలని, లేని పక్షంలో రూ.4వేలు జరిమానా పడుతుందని బ్యాంక్ నుంచి ఫోన్ వచ్చిందన్నారు. వెంటనే లింక్ ఇవ్వడంతో ఓటీపీ చెప్పాడు. ఓటీపీ చెప్పగానే కార్డులో నుంచి రూ.71,964 స్వాహా చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్



మహబూబాబాద్ అర్బన్: క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాల, క్రమశిక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలని, చెడు అలవాట్లతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండి క్రమశిక్షణతో మెలగాలన్నారు. మున్సిపల్ స్థాయిలో సీఎం కప్‌లో విజేతలుగా నిలిచి మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై దీపికరెడ్డి, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఎస్టీ హాస్టల్ వార్డెన్ యాకూబ్ పాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

గార్ల: బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు అనంతరం డిప్యూటీ తహసీల్దార్ జర్పుల సుధాకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సక్రు వీరభద్రం, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ గణేష్, మంగీలాల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

గూడూరు: అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న దట్టమైన అడవిలోని వీరంపేట, ములుగు జిల్లా కొత్తగూడ మండలం కార్లాయి గ్రామస్తులకు మహబూబాబాద్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ శుక్రవారం చేయూతనందించింది. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కార్లాయి, వీరంపేట గ్రామస్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వరప్రసాద్, కోశాధికారి మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, కట్ల వెంకన్న, సుధాకర్ పాల్గొన్నారు.